తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

14-03-2026
శనివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 49

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## హిందు ముస్లిం భాయి భాయి

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

హిందు ముస్లిం భాయి భాయి గంగా జమున నదుల్లా ఉంటారని ఒకరిని ఒకరు గౌరవించుకోవడం అన్నదమ్ముల్లా కలిసి ఉంటామని నాటి నిజాం నుండి రంజాన్ వేడుకలు ఇఫ్తార్ విందు ప్రారంభం అయ్యిందని అన్నదమ్ములా కలిసి జరుపుకుంటామని మంత్రి గడ్డం వివేక్ అన్నారు




8

# మూసీ పునరుజ్జీవం


# మనందరి బాధ్యత

## అభివృద్ధిని అడ్డుకోవద్దు.. సలహాలు ఇవ్వండి

### ప్రతిపక్షాలకు రేవంత్ రెడ్డి సీఎం సూచన

### గోదావరి జలాలతో మూసీకి కళ.. రూ. 75 కోట్లతో బాపూఘాట్ వద్ద గాంధీ విగ్రహం

ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. మేం తెచ్చే ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. బుల్‌డోజర్లతో కూల్చేస్తున్నారని అంటున్నారని చెప్పారు. అవి చదువుకున్నవాళ్లు మాట్లాడే మాటలా అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు మూడు నెలలు అక్కడ నివసిస్తారా? అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.



**హైదరాబాద్, మార్చి 13:** మూసీ ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వానికి రాజకీయ భేదాలు ఉండొచ్చు కానీ, అభివృద్ధి విషయంలో 'పొలిటికల్ పెరాలసిస్' లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకే ఈ


మిగతా 2 లో



## ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

### అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు

### గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు



3

## ఒమన్‌లో డ్రోన్ దాడి

### ఇద్దరు భారతీయుల మృతి

ఒమన్‌లోని సోహార్ నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మందికి గాయాలు కాగా.. వీరిలో 10 మంది భారతీయులేనని సమాచారం. ఐదుగురు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని భారత విదేశాంగ వెల్లడించింది.

02

## ఆర్టీసీలో సమ్మె సైరన్

### డిమాండ్లతో కూడిన నోటీస్ ఇచ్చిన జేఏసీ

02

### మావోయిస్ట్ అగ్రనేత

## సంస్మరణ సభ

### హాజరైన 230 మందికి ఎన్ఐఏ నోటీసులు

## చర్లపల్లికి మరో 'అమృత్ భారత్'

4



- అస్సాంలో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించిన ప్రధాని మోదీ
- తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు శుభవార్త

## ఇంధన, గ్యాస్ కొరతపై సర్కారు అలర్ట్

### అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా చర్యలు

### కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిస్థితులపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.**

**హైదరాబాద్, మార్చి 13:** శుక్రవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సరఫరా అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, మార్కెట్‌లో నెలకొన్న స్వల్ప కొరతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. గ్యాస్ ఉత్పత్తిని పెంచామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రభుత్వం

మిగతా 2 లో

## మూసీ నది శుద్ధికి అభ్యంతరం లేదు

### ఇళ్ల కూల్చివేతనే మా అభ్యంతరం!

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్



మూసీ నది పునరుజ్జీవనాన్ని బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని, అయితే అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు బీజేపీపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. 'గాంధీ సరోవర్' పేరుతో నివాసాలను ధ్వంసం చేయడం అంగీకారయోగ్యం కాదని పేర్కొన్నారు.

03



## ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

### గజ్వేల్ ఇఫ్తార్ విందులో హరీష్ రావు విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గజ్వేల్ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులు తిరిగి వెనక్కి తీసుకుంది. కొత్త నిధులు ఇవ్వాల్సింది పోయి, ఉన్న నిధులు లాక్కోవడం దారుణం

02

## నేడు అఖిలపక్ష భేటీ

### ప్రజాభవన్ వేదికగా భట్టి అధ్యక్షతన సమావేశం

### ముఖ్య అతిథిగా హాజరు కానున్న సిఎం రేవంత్

### కిషన్ రెడ్డి, బండి తదితరులను ఆహ్వానించిన భట్టి



**హైదరాబాద్,మార్చి7 :** పార్లమెంట్ మలివిడత సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో పెండింగ్ సమస్యలపై గళమెత్తేందుకు ఎంపిలు ఏకతాటిపై నడవాలని ప్రభుత్వం కోరుకుంటోంది. ఈక్రమంలో ప్రజాభవన్‌లో శనివారం అఖిలపక్ష ఎంపీల సమావేశం

మిగతా 2 లో

## భారతి బిల్డర్స్‌కు 4.74 కోట్ల భారీ జరిమానా

### తెలంగాణ రెరా కొరడా

### ప్రీ-లాంచ్ పేరుతో అక్రమ వసూళ్లు..

### ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలం

### కొనుగోలుదారులకు 60 రోజుల్లోగా వడ్డీతో సహా నగదు వాపసు చేయాలని ఆదేశం




02



# ఆర్టీసీలో సమ్మె సైరన్

**సిరి న్యూస్‌టుడే, హైదరాబాద్, మార్చి 13:** తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం తీసుకుంటామని.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను వెంటనే చేపట్టాలన్నారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలి.పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలి.ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి. అన్ని కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌వాసులకు మరో అర్బన్ పార్క్

### గుర్రంగూడ అటవీ భూములను రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తింపు

### ఉత్తర్వుల జారీచేసిన తెలంగాణ ప్రభుత్వం

**సిరి న్యూస్‌టుడే, హైదరాబాద్, మార్చి 13:** నగరవాసులకు ప్రభుత్వం ఓ తీపి కబురు అందించింది. నగర శివార్లలో మరో భారీ పచ్చని ప్రదేశం 'అర్బన్ ఫారెస్ట్ పార్క్' రూపంలో అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి తెరదించుతూ, ఆమన్‌గల్ డివిజన్ పరిధిలోని గుర్రంగూడ అటవీ భూములను 'రిజర్వ్ ఫారెస్ట్'గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నగర పర్యావరణానికి పెద్ద పీట వేయనుంది. సుమారు 424 ఎకరాల 31 గుంటల భారీ విస్తీర్ణంలో ఈ అటవీ భూభాగం విస్తరించి ఉంది. తెలంగాణ ఫారెస్ట్ చట్టం-1967లోని సెక్షన్ 15 ప్రకారం.. పర్యావరణ, అటవీ శాఖ ఈ హోదాను కల్పించింది. ఈ భూముల్లోని సాహెబ్‌నగర్ కలాన్ గ్రామానికి చెందిన 102 ఎకరాలపై సుదీర్ఘ కాలంగా కోర్టులో వివాదం నడిచింది. దీనిని 'సాహెబ్‌నగర్ కలాన్ కేసు'గా పిలుస్తారు. చివరకు సుప్రీంకోర్టు అటవీ శాఖ వాదనను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో ఆక్రమణదారుల నుంచి ఈ భూమికి విముక్తి లభించింది. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న తరుణంలో? ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించే 'గ్రీన్ లంగ్ స్పేస్'గా దీనిని తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. పర్యాటకుల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ కుటుంబాలతో కలిసి వారాంతాల్లో సమయాన్ని గడిపేలా విశ్రాంతి ప్రదేశాలు, చిన్నారుల కోసం ప్లే ఏరియాలు రానున్నాయి. అడవుల ప్రాముఖ్యతను వివరించేలా నాలెడ్జ్ సెంటర్లను ఇక్కడ నిర్మించే అవకాశం ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ హోదా రావడం వల్ల ఇక్కడ ఉన్న స్థానిక వృక్ష సంపద, జీవవైవిధ్యానికి చట్టపరమైన రక్షణ లభిస్తుంది. ఇకపై ఇక్కడ ఎలాంటి అనధికారిక నిర్మాణాలు లేదా ఆక్రమణలకు తావు ఉండదు. హైదరాబాద్ చుట్టుపక్కల ఇప్పటికే ఉన్న గజ్వేల్, శామీర్‌పేట వంటి అర్బన్ పార్కుల తరహాలోనే.. గుర్రంగూడ పార్క్ కూడా బిఎన్ రెడ్డి నగర్, హస్తినాపురం, సాగర్ రోడ్ ప్రాంతాల వారికి ప్రధాన పర్యాటక కేంద్రంగా మారనుంది.

# అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయండి: సీఎస్

**సిరి న్యూస్‌టుడే, హైదరాబాద్,మార్చి13 :** ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. సెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బ్జడెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బ్జడెట్ సమావేశాల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నార ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటి ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

### మార్చి 16న నోటిఫికేషన్


### 18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

**సిరి న్యూస్‌టుడే, నిర్మల్,మార్చి13 :** తెలంగాణలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను ఆర్జీయూకేటీ బాసర వీసీ గోవర్దన్ శుక్రవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. మార్చి 16న నోటిఫికేషన్, మార్చి 18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల పక్రియ కొనసాగనుంది. అర్హులైన అభ్యర్థులు టీజీఆన్‌లైన్ సెంటర్లు/మీసేవ/యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రొవిజినల్ జాబితాను మే 30న ప్రకటించి తొలి విడత కౌన్సెలింగ్‌ను జూన్ 5న నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. ఈ షెడ్యూల్ విడుదల కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఈ. మురళీ దర్శన్, ప్రవేశాల కన్వీనర్ శీలం శేఖర్, కో-కన్వీనర్ బండి హరికృష్ణ, అసోసియేట్ డీన్‌లు డా.మహేష్, డా. విఠల్, డా.దేవరాజ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# మూసీ పునరుజ్జీవం మనందరి బాధ్యత

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టామని స్పష్టం చేశారు. ప్రపంచంలోని సింగపూర్, లండన్, సియోల్ వంటి నగరాలను అధ్యయనం చేసిన తర్వాతే ఈ ప్రణాళిక రూపొందించామని సీఎం వివరించారు. "నిజాం రాజులు వందేళ్ల క్రితం అందించిన జలాశయాలు నేటికీ మన దాహార్తిని తీరుస్తున్నాయి. అదే స్ఫూర్తితో భవిష్యత్ తరాల కోసం మూసీని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనపై ఉంది" అని పేర్కొన్నారు. మూసీని వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బీజేపీ నేతలు అడ్డుపడటం మానేసి, ప్రాజెక్టును మరింత మెరుగ్గా ఎలా చేయాలో సలహాలు ఇవ్వాలని కోరారు. ఆ సలహాలను స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేవలం రంగారెడ్డి జిల్లా ప్రయోజనాలే కాకుండా, కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్న నల్గొండ జిల్లా రైతాంగం గురించి కూడా ఆలోచించాలని సీఎం కోరారు. గోదావరి జలాల్లో 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు ప్రారంభించామని, తద్వారా మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. బాపూఘాట్ వద్ద రెండు నదుల సంగమ ప్రాంతాన్ని కన్యాకుమారి తరహాలో తీర్చిదిద్దుతామని, అక్కడ రూ. 75 కోట్లతో బాపూ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బుల్‌డోజర్ల ప్రస్తావన తెస్తూ ప్రతిపక్షాలు పేదలను భయపెట్టడం మానుకోవాలని, అభివృద్ధి ఎవరికీ వ్యతిరేకం కాదని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.



# ఇంధన, గ్యాస్ కొరతపై ప్రభుత్వం అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు మరియు ఇతర ఉన్నతాధికారులతో కూడిన కమిటీని నియమించారు. అదేవిధంగా ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు మరియు కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో సరఫరాను పర్యవేక్షిస్తాయని మంత్రి వివరించారు. హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా 'కమాండ్ కంట్రోల్ రూమ్'ను ఏర్పాటు చేసి, సరఫరాలో తలెత్తే అంతరాయాలను నివారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. హోటళ్లు, రెస్టారెంట్ల యజమానుల విజ్ఞప్తి మేరకు తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించాలన్న విన్నపాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ఇంధన, గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.



# మావోయిస్ట్ అగ్రనేత సంస్మరణ సభ

### హాజరైన 230 మందికి ఎన్ఐఎ నోటీసులు

**సిరి న్యూస్‌టుడే, కరీంనగర్, మార్చి 13:** ఇటీవల మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియలు, సంస్మరణ సభకు హాజరైన మాజీ మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 230 మందికి నోటీసులు జారీ చేయడం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద చర్చకు దారితీసింది. గతేడాది అక్టోబరు 18 న హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిల జ్ఞాపకార్థం 'నారాయణపూర్ అమరుల సంస్మరణ సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల్లోలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. సభలో పాల్గొన్న వారిపై ఎన్ఐఎ ఆకస్మికంగా నోటీసులు జారీ చేసింది. ఈ సభలో పాల్గొన్న కొందరు నాయకులు ప్రభుత్వ వ్యతిరేక, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గాదె ఇన్నయ్యలాంటి వారిపై ఇప్పటికే దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. నిషేధిత సంస్థలతో సంబంధాలు లేదా ఆ సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారా అనే కోణంలో లోతైన విచారణ చేపట్టడానికి ఈ నోటీసులు ఇచ్చారు. జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, పినాకపాణి వంటి ప్రముఖులు ఈ సభలో పాల్గొనడం కూడా దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించింది. నోటీసులు అందుకున్నవారిలో మెజారిటీ వ్యక్తులు హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, ముల్కనూరు, కమలాపూర్, ధర్మసాగర్, పరకాల, టేకుమట్ల, వేలేరు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. దశాబ్దాల క్రితమే జనజీవన స్రవంతిలో కలిసిపోయిన తమకు, నోటీసులు రావడంపై మాజీ మావోయిస్టులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# దేశంలో గ్యాస్ కొరత లేదు

### ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు.. కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

**సిరి న్యూస్‌టుడే,న్యూఢిల్లీ, మార్చి 13:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల ర్గి÷ల్గ÷నింగ్ కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్టిబ్యూష్రన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్టిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# భారీ జీఎస్టీ కుంభకోణం బట్టబయలు

### రూ.84.15 కోట్ల మోసం

**సిరి న్యూస్‌టుడే, హైదరాబాద్,మార్చి13:** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ భారీ జీఎస్టీ కుంభకోణాన్ని బయట పెట్టింది. సుమారు రూ.84.15 కోట్ల విలువైన ఐటీసీ మోసం జరిగినట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు గుర్తించారు. సందీప్‌కు సంబంధమున్న ఇతర సంస్థల్లోనూ అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈక్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను అధికారులు రద్దు చేశారు. సందీప్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.




# భారతి బిల్డర్స్‌కు 4.74 కోట్ల భారీ జరిమానా

### తెలంగాణ రెరా కొరడా

### ప్రీ-లాంచ్ పేరుతో అక్రమ వసూళ్లు..

### ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలం

### కొనుగోలుదారులకు 60 రోజుల్లోగా వడ్డీతో సహా నగదు వాపసు చేయాలని ఆదేశం

**సిరి న్యూస్‌టుడే,హైదరాబాద్, మార్చి 13:** నిబంధనలకు విరుద్ధంగా 'ప్రీ-లాంచ్' స్కీమ్‌ల పేరుతో కొనుగోలుదారుల నుండి నిధులు వసూలు చేసి, నిర్మాణ పనులు చేపట్టని భారతి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (T-RERA) భారీ జరిమానా విధించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం రూ. 4,74,17,729 కోట్ల జరిమానా విధిస్తూ అథారిటీ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విధించిన జరిమానాకు అదనంగా తాజా ఉల్లంఘనల కింద ఈ మొత్తాన్ని నిర్ణయించింది. 2021లో ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు, రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామంటూ బిల్డర్ కొనుగోలుదారుల నుండి నిధులు సేకరించారు. అయితే, ప్రాజెక్టులో ఎటువంటి పురోగతి లేకపోవడంతో బాధితులు రెరాను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన అథారిటీ, భారతి బిల్డర్స్‌ను లిలి'డిఫాల్టర్ ప్రమోటర్'లిలిగా ప్రకటించింది. బాధితులు చెల్లించిన పూర్తి మొత్తాన్ని వడ్డీతో కలిపి 60 రోజుల్లోగా వాపసు చేయాలని స్పష్టం చేసింది. ఈ బాధ్యతను భారతి బిల్డర్స్ మరియు భాగస్వామ్య సంస్థలు ఉమ్మడిగా భరించాలని తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా రెరా అథారిటీ రియల్ ఎస్టేట్ కొనుగోలుదారులకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టుల్లో 'ప్రీ-లాంచ్' ఆఫర్లలో పెట్టుబడులు పెట్టడం చట్టరీత్యా నిషిద్ధమని పేర్కొంది. ఇటువంటి స్కీమ్‌ల వల్ల కొనుగోలుదారులు ఎస్క్రో ఖాతా భద్రతను, ప్లానింగ్ అథారిటీ వద్ద ఉండే మార్టిగేజ్ రక్షణలను కోల్పోతారని హెచ్చరించింది. ఏదైనా ప్రాజెక్టులో ఫ్లాట్ లేదా ప్లాట్ కొనే ముందు తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని అథారిటీ సూచించింది.





# ఏపీ మాజీ డీజీపీ దొర మృతి

**అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి**

**వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో కీలక పదవుల నిర్వహణ**

**హైదరాబాద్,మార్చి13:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్. జె. దొర మరణించారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకున్నారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంట్లో బాత్‌రూ-మ్‌లో ఆయన పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలుస్తోంది. 1965 ఐపీఎస్ బ్యాచ్ అధికారి హెచ్.జె.దొర. 1996 నుంచి 2002 వరకు ఉమ్మడి ఏపీ డీజీపీగా దొర విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఉమ్మడి ఏపీలో నక్సలైట్లను అణిచి వేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే సీఐఎస్‌ఎఫ్ డీజీగా, విజిలెన్స్ కమిషనర్‌గా సైతం దొర పని చేశారు. 943లో శ్రీకాకుళంలో హెచ్.జె.దొర జన్మించారు. తన సుదీర్ఘ జీవితకాలంలో దాదాపు 40 ఏళ్ల పాటు పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో ఆయన సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదట అడిషనల్ డీజీపీగా అనంతరం డీజీపీగా దొర బాధ్యతలు చేపట్టారు. 2002లో డిప్యూటేషన్‌పై దేశ రాజధాని న్యూఢిల్లీలో సీఐఎస్ఎఫ్ డీజీగా పని చేశారు. పోలీసు శాఖతోపాటు క్రీడారంగంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఇండియన్ ఒలంపిక్స్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1993లో పీపుల్స్ వార్ గ్రూపు లక్ష్యంగా చేసుకున్న 40 మంది పోలీసు అధికారుల జాబితాలో హెచ్.జె.దొర పేరు కూడా ఉంది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన పోలీస్ మెడల్ అందుకున్నారు.

## సిఎంలు, ప్రముఖుల సంతాపం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీసుశాఖకు బ్రాండ్ క్రియేట్ చేయడంలో హెచ్‌జే దొర కీలక పాత్ర పోషించారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. నక్సల్స్ సమస్య పరిష్కరించడంలో సమర్థంగా వ్యవహించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, డీజీపీగా హెచ్‌జే దొర సేవలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంలో, పోలీసు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం రేవంత్ తెలియజేశారు. హెచ్.జె.దొర మృతి పట్ల వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్, పోలీస్ సంక్షేమ సంఘం సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

# ఒమన్‌లో డ్రోన్ దాడి

**ఇద్దరు భారతీయులు మృతి**




**న్యూఢిల్లీ, మార్చి 13 :** ఒమన్‌లోని సోహార్ నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మందికి గాయాలు కాగా.. వీరిలో 10 మంది భారతీయులేనని సమాచారం. ఐదుగురు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని భారత విదేశాంగ వెల్లడించింది. వీరిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని పేర్కొంది. మిగతా బాధితులు డిశ్చార్జి అయినట్లు తెలిపింది. సంబంధిత కంపెనీతోపాటు స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నామని, వారికి అవసరమైన సాయం అందిస్తున్నామని తెలిపింది. యుద్ధం మొదలైన తర్వాత పశ్చిమాసియా నుంచి 1.50లక్షల మంది స్వదేశానికి వచ్చినట్లు భారత విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి (గల్ఫ్ విభాగం) అసీం మహాజన్ వెల్లడించారు. డ్రోన్ దాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం ఆయన తెలపలేదు. ఒమన్ న్యూస్ ఏజెన్సీ ప్రకారం.. సోహార్‌లో రెండు డ్రోన్ దాడులు జరిగాయి. ఇందులో ఒకటి అల్ అవీ ఇండస్ట్రియల్ జోన్‌ను తాకింది. ఇక్కడ పనిచేసే ప్రవాసుల్లో ఇద్దరు మృతిచెందినట్లు పేర్కొంది. తాజా ఘటనతో పశ్చిమాసియా ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల సంఖ్య ఐదుకి చేరినట్లయ్యింది. అయితే, ఒమన్‌లో మాత్రం ఇదే తొలిసారి. అంతకుముందు మర్చంట్ నౌకల్లో జరిగిన దాడుల్లో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్,మార్చి13:** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మ-రోసారి తగ్గుముఖం పట్టాయి. గురువారంతో పోలిస్తే నేశుక్రవారం నాటి మార్కెట్లలో గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంకాస్త దిగొచ్చాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో బంగారం, వెండి రేట్లను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధరపై రూ.980 పతనమై రూ.1,61,240కు చేరగా.. 22 క్యారెట్ల 10 గ్రాములపై రూ.900 తగ్గి రూ.1,47,800 వద్ద ట్రేడవుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. క్రితం రోజుతో పోలిస్తే కిలో వెండిపై రూ.100 తగ్గింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,79,900గా ఉంది. అయితే.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమే ధరల తగ్గుదలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## జేఈఈ దరఖాస్తుదారులకు ఛాన్స్

**హైదరాబాద్,మార్చి13 :** జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలనే వారికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుభవార్త చెప్పింది. దరఖాస్తు చేసుకొనేందుకు మరో చాన్స్ ఇచ్చినట్టు పేర్కొన్నది. విద్యార్థుల నుంచి పెద్దఎత్తున వినతులు వచ్చిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ విండోను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించింది. గురువారం నుంచి శుక్రవారం రాత్రి 9 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల్లో మార్పు చేసుకొనే అవకాశం లేదని స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9 వరకు జరుగనున్నాయి.

# మూసీ శుద్ధికి అభ్యంతరం లేదు..

- ఇళ్ల కూల్చివేతనే మా అభ్యంతరం!
- నిరుపేదలను నిరాశ్రయులను చేస్తే సహించం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- దేశంలో ఇంధన కొరత లేదు.. ప్రజలను భయపెట్టొద్దని కాంగ్రెస్‌కు హితవు




**సిరి న్యూస్‌టుడే,హైదరాబాద్, మార్చి 13:** మూసీ నది పునరుజ్జీవనాన్ని బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని, అయితే అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు బీజేపీపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. మూసీ నది స్వచ్ఛంగా ఉండాలని, ఆ నీరు రైతులకు సాగు కోసం ఉపయోగపడాలని తాము కూడా కోరుకుంటున్నామని, కానీ 'గాంధీ సరోవర్' పేరుతో నివాసాలను ధ్వంసం చేయడం అంగీకారయోగ్యం కాదని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చకుండానే ప్రాజెక్టును రీ-అలైన్ చేసుకోవచ్చని రాంచందర్ రావు సూచించారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్‌ను ఉదాహరణగా చూపే వారు.. అక్కడ నరేంద్ర మోదీ ప్రభుత్వం ముందుగా పేదలకు పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ ఇళ్లు ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఏ ఒక్క ఇల్లు దెబ్బతినకుండా ఆకాశాన్ని తాకేలా గాంధీ విగ్రహాన్ని నిర్మించుకున్నా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

**ఇంధన భద్రతపై అపోహలు వద్దు**

అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత ఏర్పడుతుందంటూ కాంగ్రెస్ నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం బాధ్యతారాహిత్యమని రాంచందర్ రావు మండిపడ్డారు. ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే దౌత్యపరమైన చర్యలు చేపట్టి హర్మూజ్ జలసంధి ద్వారా చమురు నౌకలు క్షేమంగా వచ్చేలా చేశారని గుర్తుచేశారు. దేశానికి అవసరమైన ముడి చమురు సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని, స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చేమో కానీ కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు ప్రజల్లో ధైర్యం నింపాలే తప్ప, అవాస్తవాలతో గురిచేయడం సరికాదని హితవు పలికారు.

# ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

**గజ్వేల్ ఇఫ్తార్ విందులో హరీష్ రావు విమర్శలు**



**సిరి న్యూస్‌టుడే, గజ్వేల్,మార్చి13 :** రంజాన్ మాసాన్ని పు-రస్కరించుకుని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీదులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి వారు ఇఫ్తార్ విందులో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ముస్లిం సోదరులకు రంజాన్ అత్యంత ప్రాముఖ్యమైన మాసం. ఆకలితో అలమటించే పేదవారి కడుపు బాధ ఎలా ఉంటుందో ఈ ఉపవాస దీక్షల ద్వారా ప్రతి ఒక్కరికి అర్థమవుతుందని' అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై స్పందిస్తూ.. 'గల్ఫ్ దేశాలలో యుద్ధ వాతావరణం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోతోంది. దీని వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. భవిష్యత్ లో పెట్రోల్ ధరలు పెరగడమే కాకుండా, గ్యాస్ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గజ్వేల్ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులు తిరిగి వెనక్కి తీసుకుంది. కొత్త నిధులు ఇవ్వాల్సింది పోయి, ఉన్న నిధులు లాక్కోవడం దారుణం. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ముస్లిం సోదరుల సంక్షేమం కోసం కట్టుబడ ఉంటామని' అన్నారు.

# ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

- మంత్రి శ్రీధర్ బాబు



**సిరి న్యూస్‌టుడే, హైదరాబాద్,మార్చి13 :** ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రి÷-జడెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**టూరిస్ట్ బోల్తాపడి నలుగురు ప్రయాణికుల మృతి**

**క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు**

**సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు**

**సిరి న్యూస్‌టుడే,నిజామాబాద్, మార్చి 13:** నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందల్వాయి మండలంలోని గన్నారం శివారులో ఉన్న బ్రహ్మంగారి ఆలయం సమీపంలో 44వ జాతీయ రహదారిపై టూరిస్ట్ బస్సు అర్ధరాత్రి 2 గంటల సమయంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందగా.. పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టూరిస్ట్ బస్సు వేగంగా ప్రయాణిస్తుండగా.. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం తో బస్సు ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదం గన్నారం గ్రామ శివారులోని బ్రహ్మంగారి ఆలయం దగ్గర చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, అత్యవసర సేవలకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. బస్సు బోల్తా పడిన సమయంలో తీవ్ర గాయాల కారణంగా వారు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడగా వారిని స్థానికుల సహాయంతో సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఇతర పెద్ద ఆస్పత్రులకు తరలించినట్లు సమాచారం. వైద్యులు గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. బస్సులో చిక్కుకున్న వారిని



బయటకు తీసేందుకు రెస్క్యూ బృందాలు శ్రమించాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం అయింది. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.



సంపాదకీయం

# అపరిపక్వ విపక్షనేత రాహుల్ గాంధీ!

భారత ప్రజాస్వామ్యంలో విపక్ష నేత అంటే బురదజల్లే నేత అని అర్థం రూఢి అవుతోంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా విపక్షంలో ఉన్నవారు నాలుగు రాళ్లు వేయడం, బురద జల్లడం, ప్రభుత్వం ఏం చెబుతుందో తెలుసుకోకుండానే సభనుంచి నిష్క్రమించడం పరిపాటిగా మారింది. సరిగ్గా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఇప్పుడు అదే పాత్రలో ఒదిగి పోయారు. పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచమంతా వణుకుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ ఆయుధ బలంతో ఇరాన్‌ను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచంలోని మారుమూల పల్లె కూడా ప్రభావితం అవుతోంది. మనవద్ద గ్యాస్, ఇంధన కొరతలను ఎదుర్కొంటున్నాం. ఇదేమీ మోడీ తెచ్చుకున్న విపత్తు కాదు. లేదా కావాలని కోరుకున్నదీ కాదు. అధికారంలో కాంగ్రెస్ ఉండివుంటే ఇంతకన్నా దారుణంగా ఉండేది. ఎందుకంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాతనే క్రూడాయిల్ దిగుమతి పెరిగింది. ఇంధన సామర్థ్యం పెరిగింది. దేశంలో రిఫనరీల సామర్థ్యం పెంచి వ్యాపారం చేసుకునే స్థాయికి ఎదిగింది. గ్యాస్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. మారుమూల పల్లెలకు సైతం గ్యాస్ చేరుతోంది. ఇతర దేశాలకు కూడా ఇంధనం సరఫరా చేసే స్థాయికి భారత్ ఎదిగింది. వివిధ దేశాలతో సత్సంబంధాలే ఇందుకు నిదర్శనం. ఇంత సంక్షోభంలోనూ ఇరాన్ మనపట్ల సానుకూలంగా ఉందంటే, మనం అనుసరిస్తున్న విదేశాంగ విధానమే కారణం. రాహుల్ చెప్పటినట్లు నడుచుకుంటే దేశం ఏనాడో భ్రష్టు పట్టిపోయేది. ఇకపోతే ఈ సంక్షోభంలోనూ మనం బంగ్లాదేశ్‌కు ఇంధనం సరఫరా చేయగలిగాం. పార్లమెంటులో రాహుల్ చేసిన ప్రసంగం చిన్నపిల్లవాడికన్నా అధ్వాన్నంగా ఉంది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న వంట గ్యాస్ కొరతకు, ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేరు ఉండడానికి సంబంధం ఉందంటూ విపక్షనేత రాహుల్ లోక్‌సభలో గురువారం చేసిన ఆరోపణలు ఆయన అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. రాజకీయ పరిపక్వత లేని నేత విపక్ష నేతగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడింది. అయినా కేంద్రం దానిని మానిటర్ చేస్తోంది. ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీ పడినందువల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని రాహుల్ చేసిన విమర్శలు దేశం పట్ల ఆయనకున్న అవగాహన ఇదేనని అర్థం చేసుకోవాలి. దేశ ఇంధన అవసరాలపై అమెరికా ఆంక్షలు విధించే స్థితికి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. మనం ఆయిల్‌ను ఎవరి నుంచి కొనుగోలు చేయాలి, గ్యాస్‌ను ఎక్కడి నుంచి తీసుకురావాలి అన్న నిర్ణయాలను అమెరికాకు విడిచిపెట్టాం అనడంలో అర్థం లేదు. విదేశాల నుంచి వాణిజ్యానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. రష్యా నుంచి ఆయిల్ కొనాలా, వద్దా అన్నది కూడా వాణిజ్య ఒపపందాలకు ముడిపడి ఉన్న అంశం. ఈ మాత్రం తెలియని వ్యక్తి విపక్ష నేతగా ఎలా ఉంటున్నారో ప్రజలు తెలుసుకోవాలి. ఇకపోతే మాట్లాడేదంతా మాట్లాడిన అన్నా చెల్లెళ్లు రాహుల్, ప్రియాంకలు ప్రభుత్వం సమాధానం ఇచ్చే వరకు వేచి చూడకుండా సభ నుంచి నిష్క్రమించారు. ఇది చాలు..వారు ఎంత చిత్తశుద్ధిగా ఉన్నారో తెలియడానికి. బయటకు వెళ్లి ధర్నాలు చేయడం తప్ప రాహుల్‌కు తెలిసిందేమీ లేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇరాన్ మన దేశం పట్ల చాలా సానుకూలంగా ఉండడంతో తొలి చమురు నౌక భారత్ చేరుకోగలిగింది. అలాగే రష్యా నుంచి మనం ఇంధన దిగుమతులకు అమెరికా తలూపింది. ఇవన్నీ కూడా విదేశాంగ నీతిలో ఓ భాగం. ఇకపోతే ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. అందువల్ల దేశంలో ఉన్న ఇంధన వనరులను జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్ధానికి సహకరిస్తున్న స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై తీవ్రంగానే స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హార్ముజ్ జలసంధిని గురువారం కూడా మూసివేయాలని ఆదేశించారు. ఇంత జరుగుతున్న ట్రంప్ ఇంకా తన వంకర బుద్దిని మార్చుకోవడం లేదు. ముడి చమురు ధరల కన్నా కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ 'దుష్ట సామ్రాజ్యాన్ని' నిలువరించడమే తమకు మరింత ముఖ్యమని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గాన్ని బయటపెడుతున్నాయి. చమురు ద్వారా లాభాలు ఆర్జించడం కన్నా ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవాలన్నదే ప్రాధాన్యత అని చెప్పారు. ఇరాన్ అణుశక్తిని సమకూర్చుకోవడాన్ని అనుమతించేది లేదంటూ వ్యాఖ్యానించారు. 'పని పూర్తి చేయాలని' అమెరికా కృతనిశ్చయంతో ఉన్నదని ట్రంప్ తెలిపారు. యుద్ధంలో సమర్థవంతంగా విజయాన్ని సాధించామని, అయినప్పటికీ సైనిక చర్యలు కొనసాగు తాయన్నారు. మనవరకు మనం ఇంధన అవసరాలు తీర్చుకోవడం ముఖ్యం. దేశంలో ఇంధన సంక్షోభ పెచ్చరిల్లుతున్న సమయంలో భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భారత్ పతాకంతో ఉన్న నౌకలను హార్ముజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతించింది. భారత్, ఇరాన్ విదేశాంగ మంత్రులు జైశంకర్, అబ్బాస్ అరాగ్చీ ఫోన్లో మాట్లాడిన అనంతరం మన దేశానికి ఈ ఉపశమనం దక్కింది. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ నౌకలు క్షేమంగా హార్ముజ్ జలసంధిని దాటాయి. ఇంకా ఇలాంటి ప్రయత్నాలు ఉండనున్నాయి. ఇది ఓ రకంగా మనం అనుసరిస్తున్న విదేశాంగ విధాన విజయానికి సూచిక.

# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

- అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు
- గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు

**న్యూఢిల్లీ, మార్చి 13:** అమెరికా, ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న యుద్ధంతో ఇప్పుడు ప్రపంచం యావత్తూ అతలాకుతలం అవుతోంది. ప్రధానంగా ఇంధన సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఈ యుద్ధం నుంచి వెన్నక్కి తగ్గలేక, ముందుకు వెళ్లలేక గింజుకుంటున్నాయి. ఈ యుద్ధంతో ఇజ్రాయిల్ పెద్దగా నష్టపోకున్నా, అమెరికా మాత్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. అలాగే ఇరాన్‌ను దెబ్బతీయాలన్న లక్ష్యం నెరవేరలేదు. అంతేగాకుండా ప్రజల మద్దతుతో ఇరాన్ మరింత బలంగా దాడులను తిప్పికొట్టడానికి సిద్ధం అవుతోంది. ఇది ఓ రకంగా అమెరికాకు పెద్ద నష్టం కానుంది. రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేసి కాళ్లూచేతులు కాల్చుకుంటోంది. ఇప్పుడు అమెరికాదీ అదే పరిస్థితి. ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ ప్రస్తుత హెచ్చరికలు అమెరికాకు గుణపాఠం కావాలి. అమెరికా, ఇజ్రాయెల్... ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయి ప్రాదేశిక రాజకీయ సంక్షోభంగా మారింది. ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకూ, సముద్ర రవాణా మార్గాలకూ, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. హార్మూజ్ జలసంధ వద్ద ఇరాన్ పట్టుతో ప్రపంచ దేశాలకు గమ్యం లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అమెరికా అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్‌లు హతమార్చడం ద్వారా ప్రత్యర్థి దేశపు బలాన్ని అంచనా వేయలేక పోయారు. అధినేతను తొలగిస్తే ఆ దేశాన్ని లొంగదీసుకోవాలన్న ఎత్తుగడలు దెబ్బతిన్నాయి. తమ అధినాయకుడి మరణం లేదా బలిదానం షియా వర్గాన్ని మరింత భీకర ప్రతిఘటనకు పురిగొల్పుతుంది. తమ అధినేత మరణం ప్రజల్లో ప్రతీకారేచ్ఛను పెంచుతుంది. దేశాన్ని బలహీనపరచే బదులు ప్రభుత్వానికి ప్రజల



మద్దతును మరింత విస్తృతం చేస్తుంది. సైనిక దాడుల్లో సాధారణ పౌరులు మరణించడం ద్వారా అమెరికా తలనొప్పులు తెచ్చుకుంది. పలుప్రాంతాల్లో ప్రజాగ్రహాన్ని పెంచుతోంది. బాధితుల వివరాలు సామాజిక మాధ్యమాల్లో, పత్రికలూ టీవీ ఛానళ్లలో వేగంగా ప్రసారమవుతూ అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్నీ, దౌత్య సంబంధాలనూ ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు, తనపై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడికి సహకరించిన ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితరాలపైనా... ముఖ్యంగా అక్కడి అమెరికా సైనిక స్థావరాలపైనా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయలేక పోవచ్చు కానీ, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక వసతులను కకావికలం చేయగలదు. అందుకనే గల్ఫ్ దేశాలు ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇలా జరుగుతందని అమెరికా ఊహించకపోవడం కూడా యుద్ధ వైఫల్యంగానే భావించాలి. ఓ రకంగా ఇరాన్ తెలివిగా అమెరికాను దెబ్బతీస్తోంది. అనేక గల్ఫ్ దేశాలు తమ విధానాలకు అనుగుణంగా అగ్రరాజ్య స్థావరాలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ స్థావరాలు పశ్చిమాసియా అంతటా నిఘా కార్యకలాపాలు, నౌకాదళ మోహరింపులు, యుద్ధ విమానాల ప్రయాణాలకు వీలుకల్పిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధంలో ఈ స్థావరాలపై ఇరాన్ గురిపెట్టడం ద్వారా అమెరికాను దెబ్బ కొట్టడంలో కృతకృత్యమయ్యిందనే చెప్పాలి. అందుకే ఇరాన్‌పై దాడి ద్వారా అమెరికా సాధించింది సున్నాయే కాక, ఈ యుద్ధంలో విజేత ఇరాన్ అనే చెప్పాలి. ఈ క్రమంలో తటస్థంగా ఉండాలని భావించిన దేశాలు కూడా ఇప డు యుద్ధంలో ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంధన సరఫరా గొలుసులకు కేంద్రమైన పశ్చిమాసియా మొదటి నుంచీ అగ్రరాజ్యాల పోటీకి వేదికగా ఉంది. రష్యా, చైనాలకు ఇరాన్‌తో వ్యూహాత్మక సంబంధాలున్నాయి. అవి నేరుగా జోక్యం చేసుకోకున్నా- దౌత్య, ఆర్థిక మద్దతుతో ప్రభావితం చేస్తున్నాయి. హర్మూజ్ జలసంధి ఇరాన్ అదుపులో ఉండటం ఆ దేశానికి వ్యూహాత్మక బలంగా చూడాలి. అదే తమ ట్రంప్ కార్డు అని ఇరాన్ నూతన అధినేత కూడా వ్యాఖ్యానించారు. ఇకపోతే గల్ఫ్ పరిణామాలు భారతదేశంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్నాయి. ఇండియా ముడి చమురు కోసం పశ్చిమాసియాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అంతరాయం కలగడంతో అది భారతదేశ ఇంధన భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. అయితే ఇవన్నీ ఇప్పట్లో కలొఇక్కి వస్తాయని అనుకోవడానికి లేదు. ప్రత్యమ్నాయాలు చూసుకోవాల్సిందే.

# టెహ్రాన్‌లో భారీ పేలుడు





**టెహ్రాన్:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు సంభవించింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్‌లో ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. ఇరాన్‌లోని మరో నగరం ఖజ్విన్‌లోనూ భారీ పేలుడు సంభవించింది. ఈ దాడులు ఎవరు చేశారనే విషయం తెలియరాలేదు. అయితే, ఖజ్విన్, టెహ్రాన్‌లో పేలుళ్లు జరుపుతామని ఇజ్రాయెల్ ముందే హెచ్చరించింది. మరోవైపు.. దాడులు జరుగుతున్నప్పటికీ వేలాది మంది పౌరులు టెహ్రాన్ వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటం గమనార్హం.

- ఇరాన్‌కు ట్రంప్ మరో వార్నింగ్

### ఏం జరుగుతుందో చూడండి: ట్రంప్

ఇరాన్‌కు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. మతి చెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారన్నారు. "ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యింది. వైమానిక దళం కూడా ఇక ఉండదు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. వారి నాయకులు తుడిచిపెట్టుకు పోయారు. 47 ఏళ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నా" అని సోషల్ మీడియాలో ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఇరాన్ త్వరలో లొంగిపోనుందని ఇటీవల జరిగిన జీ7 నేతల వర్చువల్ సమావేశంలో ట్రంప్ పేర్కొన్నట్లు యాక్సియోస్ వార్తా సంస్థ కథనం వెల్లడించింది.

### నలుగురు అమెరికా సైనికులు మృతి..

ఇక, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఇరాక్‌లో కుప్పకూలిన ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ప్రమాద సమయంలో విమానంలో ఆరుగురు సిబ్బంది ఉండగా.. అందులో నలుగురు చనిపోయినట్లు పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని, ఘటనకు దారితీసిన పరిస్థితులపైనా దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది.

# చర్లపల్లికి మరో 'అమృత్ భారత్'

- అస్సాంలో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించిన ప్రధాని మోదీ
- తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు శుభవార్త



**అస్సాం:** తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు, ముఖ్యంగా హైదరాబాద్ వాసులకు దక్షిణ మధ్య రైల్వే ఒక తీపి కబురు అందించింది. అస్సాం రాజధాని గౌహతి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కామాఖ్య నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్ వరకు సరికొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలో ఈ రైలును ప్రారంభించారు. సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు అభివృద్ధి చేసిన చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌కు ఈ రైలు రావడం విశేషం. వందే భారత్ రైళ్ల తరహాలోనే అత్యాధునిక సాంకేతికతతో.. తక్కువ ఖర్చుతో సామాన్యుల కోసం రూపొందించిన రైలే ఈ 'అమృత్ భారత్'. ఈ రైలుకు రెండు వైపులా ఇంజన్లు ఉంటాయి. దీనివల్ల వేగం పుంజుకోవడం సులభం అవుతుంది.. ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. ఇందులో కేవలం స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు మాత్రమే ఉంటాయి. తక్కువ ధరలో సుదూర ప్రయాణం చేసే వారికి ఇది వరం అని చెప్పవచ్చు. సెన్సార్ వాటర్ ట్యాప్స్, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, మెరుగైన సీటింగ్, వెలుతురు వంటి ఆధునిక వసతులు ఇందులో ఉన్నాయి.

-- తెలుగు రాష్ట్రాల్లో స్టాపింగ్ పాయింట్లు ఇవే..

ఈ రైలు అస్సాం నుంచి బయలుదేరి పశ్చిమ బెంగాల్, ఒడిశా మీదుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ సాగుతుంది. మన రాష్ట్రాల్లో ప్రధానంగా శ్రీకాకుళం రోడ్, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నల్గొండ రైల్వే స్టేషన్ ఆగుతుంది. ఆ తర్వాత అక్కడ నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుతుంది.

# నెలసరి సెలవులు తప్పనిసరి చేస్తే మహిళా ఉపాధికి విఘాతం

- నిబంధనలు విధిస్తే ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి యజమానులు వెనుకాడుతారు
- పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వాలే నిర్ణయించాలని సూచన



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మహిళా ఉద్యోగులకు, విద్యార్థినులకు నెలసరి సెలవులు (మెన్‌స్ట్రువల్ లీవ్) కల్పించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇటువంటి సెలవులను చట్టం ద్వారా తప్పనిసరి చేస్తే, అది మహిళల ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. నిబంధనలను కఠినతరం చేస్తే మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి యాజమాన్యాలు విముఖత చూపే అవకాశం ఉందని, ఇది వారి వృత్తిపరమైన ఎదుగుదలకు ఆటంకంగా మారుతుందని ధర్మాసనం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారిస్తూ.. ఈ అంశంలో ఉన్న సామాజిక, ఆర్థిక కోణాలను ప్రస్తావించింది. సెలవులు ఇవ్వడం వల్ల మహిళా ఉద్యోగులకు ప్రోత్సాహం లభిస్తుందన్న వాదన ఉన్నప్పటికీ, దానిని యజమానులపై బలవంతంగా రుద్దితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీస్తుందని సీజేఐ వ్యాఖ్యానించారు. "చట్టం ద్వారా సెలవులను అనివార్యం చేస్తే, ప్రైవేట్ సంస్థలు మాత్రమే కాదు, ప్రభుత్వ రంగంలో కూడా మహిళలను తీసుకోవడానికి వెనుకాడుతారు. యాజమాన్యాల మనస్తత్వాన్ని మనం అర్థం చేసుకోవాలి" అని కోర్టు స్పష్టం చేసింది. నెలసరిని ఒక ప్రతికూల అంశంగా లేదా బలహీనతగా చిత్రీకరిస్తే అది మహిళలను ఆత్మన్యూనతకు గురిచేసే ప్రమాదం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యార్థినులకు కొంత మినహాయింపులు ఇస్తున్నారని, కొన్ని ప్రైవేట్ కంపెనీలు స్వచ్ఛందంగా సెలవులు ప్రకటిస్తున్నాయని కోర్టు గుర్తుచేసింది. అయితే, దేశవ్యాప్త విధానంపై కోర్టు ఆదేశాలు ఇవ్వడం కంటే, ప్రభుత్వం అన్ని వర్గాల (స్టేక్‌హోల్డర్ల) తో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవడమే సరైనదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు పోయినా మరిన్ని వస్తాయి

**గీతం కాంక్లేవ్ లో అభిప్రాయపడ్డ పరిశ్రమ నిపుణులు**

**పటాన్ చెరు, మార్చి 13, (సిరి న్యూస్)**



కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తృత వినియోగం వల్ల తొలి దశలో కొన్ని ఉద్యోగాలు పోయినా, మున్ముందు మరిన్ని అందుబాటులోకి వస్తాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలను ఏఐ స్థానభ్రంశం చేయవచ్చని, అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు అందుబాటులో వస్తాయని అంచనా వేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు లోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ) ఆధ్వర్యంలో 'భవిష్యత్తును ఇంజనీరింగ్ చేయడం: ప్రధాన రంగాలలో ఆవిష్కరణలు' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన మూడవ దఫా ఇండస్ట్రీ కాంక్లేవ్ విజయవంతంగా ముగిసింది. రానున్న రోజులలో ఉద్యోగ మార్కెట్ విస్తరిస్తూనే ఉంటుందని, అయితే ఏఐ ఆధారిత యుగానికి తగిన నైపుణ్యాలను విద్యార్థులు సమకూర్చుకోవాలని నిపుణులు సూచించారు. ముఖ్యంగా ఇంటర్న్ షిప్ లు, పరిశ్రమల సందర్శన, ఆచరణాత్మక అభ్యాసం ద్వారా తమ జ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరచు కోవాలన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను, ముఖ్యంగా రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారిన ఏఐపై పట్టు సాధించాలని ప్రోత్సహించారు. సాంకేతిక నైపుణ్యాలు, జ్ఞానానికి మించి నియామకాలలో 75 శాతం విజయానికి ఆయా అభ్యర్థుల ప్రవర్తన, వైఖరి కారణమని వారు స్పష్టీకరించారు. కోర్ ఇంజనీరింగ్ కు పెద్దపీట వేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టడంపై గీతం యాజమాన్యాన్ని అభినందించారు. దీనివల్ల పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య అంతరం తగ్గి అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో ఎన్ఎక్స్ పీ సెమీకండక్టర్స్ లో ఇండియా ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అధిపతి ప్రీత్ యాదవ్, స్టెల్లాంటిస్ లో డెలివరీ లీడ్ సుమన్ గోర్లా ముఖ్య అతిథులుగా పాల్గొని, కీలకోప న్యాసాలు చేశారు. కోర్ ఇంజనీరింగ్ రంగాల భవిష్యత్తును రూపొందించడంలో ఆవిష్కరణ, పరిశ్రమ-విద్యా సంస్థల సహకారం యొక్క పెరుగుతున్న ప్రాముఖ్య తను వారు ప్రధానంగా ప్రస్తావించారు.

ఇండస్ట్రీ కాంక్లేవ్ లో భాగంగా, ప్రముఖ పరిశ్రమ నిపుణులతో మూడు ప్యానెల్ చర్చలు జరిగాయి. 'పారిశ్రామిక భవిష్యత్తును నడిపించడం: శక్తి, చలనశీలత, తయారీ' శీర్షికన జరిగిన తొలి ప్యానెల్ చర్చలో యాక్సిస్ ఎనర్జీ మానవ వనరుల విభాగాధిపతి వీణ పుత్రేవుల; ప్రజ్ ఇండస్ట్రీస్ డీజీఎం యోగేష్ ఖటాలే; ఓడీఎఫ్ డీజీఎం కె.సి. మోహన్; మహీంద్రా అండ్ మహీంద్రా ఎస్సీఎం అధిపతి ఎన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు. దీనిని మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ సమన్వయం చేశారు.

వ్యూహాత్మక మార్పు: హార్స్ పవర్ నుంచి కంప్యూట్ పవర్'కు అనే అంశంపై నిర్వహించిన రెండో ప్యానెల్ చర్చలో డ్రోనవేషన్ ఇండస్ట్రియల్ ఏఐ డ్రోన్ సీఈవో డాక్టర్ సౌరభ్ శ్రీవాస్తవ; ఎంటసార్ట్స్ సీటీవో డాక్టర్ ఎ. కృష్ణకాంత్; అనలాగ్ పోర్ట్ లో అనలాగ్ ఇంజనీరింగ్ డైరెక్టర్ వై. షమీర్ బాష్ ఫంక్షనల్ ఎక్సలెన్స్ లీడ్ వంశీ మగపు; గ్లోబల్ ఫౌండ్రీస్ ఎస్ఎంటీఎస్ డిజైన్ ఇంజనీర్ ప్రియాంకర్ మాథురియా పాల్గొన్నారు. దీనిని గీతం బీటెక్ (ఈఈసీఈ) మూడో ఏడాది విద్యార్థిని పర్ణిక సురేష్ సూరిసెట్టి సమన్వయం చేశారు. సాంకేతిక నైపుణ్యాలకు మించి సామర్థ్యాలను పెంపొందించడం: కోర్ ఇంజనీరింగ్ లో అవకాశాలు' శీర్షిక జరిగిన మూడో ప్యానెల్ చర్చలో బాష్ యూనివర్సిటీ రిలేషన్స్ ప్రణీత్ సరన్; స్టెల్లాంటిస్ లోని టాలెంట్ అక్విజిషన్ లీడ్ నిషితా రాయ్ పాల్గొనగా, సీజీసీ ప్రతినిధి ఎల్. వంశీకృష్ణ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ప్యానలిస్టులు గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలను సందర్శించారు. అధునాతన అభ్యాసం, పరిశోధనలకు మద్దతుగా ప్రపంచ స్థాయి సౌకర్యాలను ఏర్పాటు చేసినందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని వారు అభినందించారు. తొలుత, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు స్వాగతోపన్యాసం చేయగా, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి సూచించారు. సీజీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.వాసుదేవ్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఇందులో సీజీసీ డైరెక్టర్ డాక్టర్ కె. మమతారెడ్డి, కోర్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పటాన్ చెరు, మార్చి 13, (సిరి న్యూస్):**

మండల పరిధిలోని ఇస్నాపూర్ మున్సిపల్ చిట్కుల్ గ్రామంలో గల శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తిని పెంపొందించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, చిన్న రాములు, కౌన్సిలర్లు వెంకటేష్, ఆంజనేయులు, నాగభూషణం, గ్రామ పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 12వ వార్డులో ప్రగతి ప్రణాళిక



**తూప్రాన్ మార్చి13 సిరిన్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని 12వ వార్డులో కమిషనర్ గణేష్ రెడ్డి కౌన్సిలర్ స్వప్న నాగరాజు గౌడ్ శుక్రవారం రోజు పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధతో పని చేయిస్తున్న నాయకులు మున్సిపల్సి బ్బంది అధికారులు మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో పరిసరాల పరిశుభ్రత పాటించాలని పట్టణంలోని ప్రతి వార్డులో చెత్త సేకరణకు సంబంధించిన వాహనాలు వస్తున్నందున ప్రజలు గమనించి తడి పొడి చెత్తను చెత్త బండిలో వేయాలని పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కమిషనర్ గణేష్ రెడ్డి కోరారు 12వ వార్డు కౌన్సిలర్ స్వప్న నాగరాజు గౌడ్ మాట్లాడుతూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహాయ సహకారాలతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఏ అవసరం ఉన్న వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సామాన్య ప్రజల భారాన్ని తీర్చిన పార్టీగా ప్రజల్లో గుర్తింపు పొందిందని గృహజ్యోతి ఇందిరమ్మ ఇండ్లు గ్యాస్ సబ్సిడీ కొత్త రేషన్ కార్డులు పింఛన్లు ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు కార్యక్రమంలో కమిషనర్ గణేష్ రెడ్డి స్పెషల్ ఆఫీసర్ విస్ప రాజ్ 12వ వార్డ్ కౌన్సిలర్ స్వప్న నాగరాజ్ గౌడ్ మున్సిపల్ అధికారులు రవిశంకర్ రెడ్డి మధు సిబ్బంది నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# యువతి అదృశ్యం


**పటాన్ చెరు, మార్చి 13, (సిరి న్యూస్):**



పాపన్న పేట మండల పరిధిలోని అర్కెల పోముల తాండా కు చెందిన మెగావత్ సురేఖ (20) అనే యువతి ఇస్నాపూరు లోని తన సోదరుడి ఇంటికి వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదని ఆమె సోదరుడు పోలీసుల కు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొన్నారు. సురేఖ 10 వ తేదీ నాడు సాయంత్రం 6 గంటలకు తనకే పెండ్లి చూపులకు పెండ్లిపిల్ల బట్టల కొనుగోలు కోసం వచ్చిందన్నారు. మా ఇంటికి వచ్చింది. తమ ఇంటి వద్ద ఆ రోజు రాత్రి ఉండి 11 వ తేదీ నాడు 11 గంటలకు డ్రెస్ కోసం షాప్ కు వెళుతున్న అని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. కాని అమె వారి ఇంటికి కూడా వెళ్ళలేదు అని ఆ పిర్యాదు లో పేర్కొన్నారు. రాలేదు. ఈ యువతి వివరాలు తెలిస్తే నెంబర్ 9110536021 కి ఫోన్ చేయాలని పోలీసు లు కోరుతున్నారు.

# నేటి నుండే పదవ తరగతి పరీక్షలు

**మునిపల్లి మార్చి 13 (సిరి న్యూస్)**




పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు మునిపల్లి మండల విద్యాధికారి భీంసింగ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మునిపల్లి మండలంలో మొత్తం నాలుగు కేంద్రాలలో 554 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలోని కంకోలు పరీక్ష కేంద్రంలో 130 మంది విద్యార్థులు, బుదేరా పరీక్ష కేంద్రంలో 128 మంది విద్యార్థులు, మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 183 మంది విద్యార్థులు, పెద్దచెల్మడ పరీక్ష కేంద్రంలో 113 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్టు ఆయన వివరించారు. పదవ తరగతి పరీక్షలు ఈనెల 14వ తేదీతో ప్రారంభమై ఏప్రిల్ 13వ తేదీ వరకు నిర్వహించబడతాయని మండల విద్యాధికారి స్పష్టం చేశారు.పరీక్ష కేంద్రాల వద్ద నలుగురు చీఫ్ సూపరింటిండెంట్ లతో పాటు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

# గందరగోళం వద్దు.. కావాల్సినంతా గ్యాస్ ఉంది

- **గ్యాస్ సరఫరాపై అపోహలు పడకండి**
- **ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దు**
- **బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు**
- **అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు**
- **జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి**
- **గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి**
- **సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోనే ఈ దుస్థితి**
- **గృహ వినియోగదారులు, హాస్పిటల్స్ ,విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు,ఆశ్రమాలకు ప్రాధాన్యత**
- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ**
- **కలెక్టర్లు,ఎస్పి ల వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం**

**మెదక్ ప్రతినిధి, మార్చి13(సిరి న్యూస్ )**





అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్పిజి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్ట్యా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఎల్పిజి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటుఆసుపత్రిలకు,విద్యాసంస్థలకు,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.29 కోట్ల ఎల్పిజి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు.అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు.తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి ,గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు.అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని,గృహ వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ..జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని తెలిపారు. జిల్లా ప్రజలకు అవసరమైన మేరకు గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ప్రజల గృహ అవసరాలకు సరిపడినన్ని గ్యాస్ సిలిండర్లు అందిస్తామని వివరించారు. గ్యాస్ సిలిండర్ల లభ్యతపై ప్రజలెవరు ఆందోళన చెందవద్దని, ఎట్టి పరిస్థితుల్లో అసత్య వార్తలను నమ్మవద్దని ఆమె ప్రజలను కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్,...మెదక్ ఆర్డిఓ రమాదేవి, జిల్లా పౌరసరపాల అధికారి నిత్యానంద్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి దేవస్థానంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్**

**గుమ్మడిదల, మార్చి 13 (సిరి న్యూస్):**



తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ ప్రజలందరూ ఆనందంగా జీవించాలని బొంతపల్లి భద్రకాళి సమేత వీరభద్రస్వామిని వేడుకున్నట్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్. వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ ప్రజలందరూ ఆనందంగా అమ్మ వారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మండల పార్టీ అధ్యక్షులు పుట్టా నర్సింగరావు, కౌన్సిలర్ లు మూడు చింతల నరేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, పటాన్ చెరువు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, పటాన్ చెరువు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడమటి మహిపాల్ రెడ్డి, తులసీదాస్, ధర్మకర్తలు వీరస్వామి, భాస్కర్ గౌడ్, అశోక్ గౌడ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సురభి నాగేందర్ గౌడ్, కాంగ్రెస్ యువ నాయకులు మద్దెటి మల్లేష్ యాదవ్, వీరేష్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గుప్తా, సంతోష్ రెడ్డి, రాహుల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి పాలకవర్గ సమావేశం




**తూప్రాన్ మార్చ్ 13 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రోజు తొలి పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించిన చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ కొక్కొండ సమత కాశిరెడ్డి మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన పాలక వర్గ మొదటి సాధారణ సమావేశం నిర్వహించారు సమావేశంలో వార్డు కౌన్సిలర్స్ పాల్గొని తూప్రాన్ పట్టణ అభివృద్ధికై పలు అంశాలపై

మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న 77 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది యొక్క కాలపరిమితి 01.04.2026 నుండి 31.03.2027 వరకు పొడిగించుటకు వేతనాలు ఈ ఎస్ ఐ పి ఎఫ్ లకు శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ నిర్వహణకు నర్సాపూర్ చౌరస్తాలో గతంలో నిర్మించిన ఐ ల్యాండ్ కు పెయింటింగ్ లైటింగ్ గ్రీనరీ ఏర్పాటు 10వ వార్డు బ్రాహ్మణపల్లిలో వాటర్ ప్లాంట్ రిపేర్ చేయించాలని మున్సిపల్ పరిధిలో గల 16 రు వార్డు లలో డ్రైనేజ్ మ్యాన్ హోల్స్ రిపేరు ఇతర అవసరమున్న అవసరాలకు అంశాలపై కౌన్సిల్ ఆమోదం తెలపడం జరిగిందని తెలిపారు

# పటాన్ చెరు లో పదవ తరగతి పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు: ఎంఈఓ

- మండల వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 3196 మంది విద్యార్థులు హాజరు.. పకడ్బందీగా సీసీ కెమెరాల నిఘా
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు.



**పటాన్ చెరు, మార్చి, 13, (సిరి న్యూస్):**

పటాన్ చెరు మండల పరిధిలో నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మండల విద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం ఇక్కడ మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది పటాన్ చెరు మండలంలో మొత్తం 3,196 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని అవకాశాన్నీ తెలిపారు . ఇందులో 1,746 మంది బాలురు, 1,450 మంది బాలికలు ఉన్నారన్నారు. వీరి కోసం మండల వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కేంద్రాల పర్యవేక్షణ కోసం మొత్తం 175 మంది ఇన్విజిలేటర్ల ను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సిసి కెమెరాల పర్యవేక్షణ లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి ఎగ్జామ్ హాల్లో సీసీ కెమెరాలను అమర్చామని చెప్పారు. వీటి ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తాగు నీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, మెరుగైన టాయిలెట్ సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా ప్రతి సెంటర్ వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపుల ను ఏర్పాటు చేశామని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ సహకారంతో పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు పరీక్షా హాల్లోకి అనుమతించబడవని ఎంఈఓ నాగేశ్వరరావు వివరించారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో పరీక్షలు రాసి మండల కీర్తిని చాటాలని ఆయన ఆకాంక్షించారు. పటాన్ చెరు మండల పరీక్షా కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి. జెడ్. పి. బాయ్స్ హైస్కూల్, పటాన్ చెరు (విద్యార్థులు 240) జెడ్.పి గర్ల్స్ హైస్కూల్, పటాన్ చెరు (240), సెయింట్ జోసెఫ్ హైస్కూల్ 'A' సెంటర్ (240), సెయింట్ జోసెఫ్ హైస్కూల్ 'B' సెంటర్ (240) జెడ్ పి హైస్కూల్ ఇస్నాపూర్ (240), సెయింట్ మేరీస్ గ్రామర్ హైస్కూల్, ఇస్నాపూర్ (240), శిశు విహార్ హైస్కూల్, శాంతి నగర్ (240), వి ఎస్ ఆర్ స్కూల్, పటాన్ చెరు (240), ఒరిజన్ టెక్నో స్కూల్, గౌతమ్ నగర్ (219), శ్రీ చైతన్య హైస్కూల్, పటాన్ చెరు (220), మంజీరా హైస్కూల్, పటాన్ చెరు (220), గౌతమ్ హైస్కూల్, ఇంద్రేశం (220), శాంతి నికేతన్ హైస్కూల్, పటాన్ చెరు (188), జెడ్ పి హైస్కూల్ ముత్తంగి (209). మొత్తం విద్యార్థులు 3196 మంది ఈ పరీక్షల కి హాజరు కానున్నారని ఆయన వివరించారు.

# టేబుల్ టెన్నిస్ ఆటను ప్రారంభించిన గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్



**వెల్దుర్తి,మార్చి 13, (సిరి న్యూస్):**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి లో టేబుల్ టెన్నిస్ ను వెల్దుర్తి గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రావణ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆదర్శ్ మాట్లాడుతూ వెల్దుర్తి లోని పీఎం శ్రీ పాఠశాలలో వచ్చిన నిధులను సద్వినియోగం చేస్తూ అన్ని కార్యక్రమాలు అయిన యోగ, కరాటే, సంగీతం, స్కౌట్స్ అండ్ గైడ్స్, అలాగే ఈరోజు ప్రారంభించిన టేబుల్ టెన్నిస్ విజయవంతంగా కొనసాగిస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జరిగింది . అలాగే విద్యార్థులందరూ కూడా ఈ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత వెల్దుర్తి లో చదివి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని తెలియజేయడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతు పాఠశాలలో టేబుల్ టెన్నిస్ ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని తెలియజేస్తూ టేబుల్ టెన్నిస్ ఆడటం వల్ల మన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది అని చెప్పవచ్చు. ఈ ఆటలో నైపుణ్యం సంపాదించడం ద్వారా జాతీయ స్థాయిలో మన పాఠశాలకు గుర్తింపు తెచ్చే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులందరూ ఈ ఆటలో పాల్గొని ఆడుతూ ఆనందించాలని తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వెంకటస్వామి, నరసింహారెడ్డి, శ్రీనివాసరావు, చార్లెస్,సునీత, రేణుక, రాధిక, ఖదీర్, రాము, ప్రశాంతి, మొదలైన ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# వీరభద్ర స్వామి ఆలయాన్ని రాష్ట్ర స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతా





**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**గుమ్మడిదల, మార్చి 13( సిరి న్యూస్):**

రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా బొంతపల్లి శ్రీ భద్రకాళీ సహిత వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించేలా తీర్చిదిద్దుతామని పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయానికి రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోందని, భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా నాలుగు ప్రాకారాల నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని మౌలిక వసతులు కల్పించే దిశగా కార్యాచరణ కొనసాగుతోందని చెప్పారు. గతంలో ఆలయ అభివృద్ధి కోసం తాను వ్యక్తిగతంగా 50 లక్షల రూపాయల విరాళం అందజేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రధాన గోపురం నిర్మాణానికి కూడా తమవంతు సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. బొంతపల్లి ఆలయం ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన క్షేత్రమని, భవిష్యత్తులో ఈ ఆలయాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లి ప్రతాప్ రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు చూర్ణం చక్రపాణి, సురభి కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి, కత్తుల రమేష్, అభి శెట్టి రాజశేఖర్, సంజీవరెడ్డి, ఆర్ల కిషన్ మేడి మురళి, ధర్మకర్తలు భార్య భాస్కర్ గౌడ్, వీరస్వామి, సీనియర్ నాయకులు, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, షేక్ హుస్సేన్, పొన్నాల శ్రీనివాసరెడ్డి నరహరి, ఆకుల సత్యనారాయణ, మద్ది శేఖర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

### ఆలయంలో ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం మర్యాదలతో చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా స్వాగతం పలికారు.

# ఐస్ క్రీమ్ పార్లర్ యజమాని పై కేసు నమోదు

**తూప్రాన్ మార్చ్ 13 సిరి న్యూస్**




తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పలు దుకాణాలలో పోలీస్ ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం రోజు తనిఖీలు నిర్వహించగా గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ తొ కలిసి తనిఖీ చేస్తున్న సమయంలో గడువు ముగిసిన పలు ఆహార పదార్థాలు నిల్వ ఉంచి విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు గుర్తించి మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి వాటిని స్వాధీనపరచుకొని సంబంధిత ఆహార భద్రత చట్టాల ప్రకారం విచారణ చర్యలు తీసుకుంటామని ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా స్వాధీనం చేసిన గడువు ముగిసిన ఆహార పదార్థాలను అక్కడే ఓపెన్ చేసి భూమిలో పాతేయడం జరిగిందని షాప్ యజమాని మహవీర్ పై కేసు నమోదు చేయడం జరిగిందని గడువు ముగిసిన తిను పదార్థాలను షాప్ లలో ఉంచారాదని నిబంధనలూ ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ ఎస్ఐ గంగరాజు సంబంధిత అధికారులు హెచ్చరించారు

# సుందరీకరణకు నోచుకోని దూలపల్లి లింగయ్య చెరువు



**కొంపల్లి,మార్చ్-14(సిరి న్యూస్).**

దూలపల్లి 289 డివిజన్ దూలపల్లి లో ఉన్న లింగయ్య చెరువు సుందరీకరణ చేయాలనీ డివిజన్ బిజెపి అధ్యక్షులు బూర్గుబావి దుర్గ మరియు నాయకులు కలిసి శుక్రవారం నాడు స్థానిక డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డికి మరియు దుండిగల్ గండిమైసమ్మ ఎం.ఆర్.ఓ.గారికి వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ ప్రజల కొరకు లింగయ్య చెరువుని సుందరీకరించి చెరువు కట్టను 15 ఫీట్ల వెడల్పు పెంచి వాకింగ్ పార్క్ లాగా మార్చాలని అన్నారు. చెరువు నిత్యం అలుగు పారడంతో నడవడానికి ఇబ్బందిగా ఉందని చెరువు కట్ట పైనకు వెళ్లడానికి బ్రిడ్జి నిర్మించి డివిజన్ ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను వారు కోరారు.ఒకప్పుడు మంచి నీళ్లు ఉండే చెరువు ప్రస్తుతం మురికి చెరువుగా మారిందని చెరువులో గుర్రపుడెక్క సమస్య అధికంగా ఉందని మురికి నీళ్లు కలవకుండా ఉంటే గుర్రపుడెక్క రాకుండా ఉంటదని వివరించారు. అంతేకాకుండా అలుగుల కింద మట్టికుప్పలు తీయించి సిమెంట్ బెడ్ వేస్తే నీళ్ళు వెళ్ళడానికి సులువుగా ఉంటుందని అలుగుల పక్కన ఉన్న కాళీ స్థలంలో మరుగుదొడ్లు నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులకు సూచనలు చేసారు.ఒక్కసారి పరిశీలించి కావాల్సిన వాటిని సమకూర్చి డివిజన్ ప్రజలకు ఉపయోగంగా ఉండేలా చూడాలని అధికారులను వారు కోరినట్టుగా తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూర్గుబావి అశోక్..నర్సింగ్ రావు.అశ్విన్.శేఖర్ పాల్గొన్నారు.

# కౌన్సిలర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**సదాశివపేట. మార్చి13. (సిరిన్యూస్)**

8వ వార్డు కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ ముఖ్య అతిథులుగా రావడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైన మాసమని, రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడుతూ, అల్లాకు ప్రార్థనలు నిర్వహిస్తూ, అల్లా ఆశీర్వాదములు పొందుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరీద్, మహిమద్దీన్, బద్దాద్, జమీర్, బందేలీ, నిజాం, అల్తాఫ్, మోహి, అజ్జు,యదు,ముస్తఫా, మొహమ్మద్,ఫయాజ్,అల్తాఫ్, అక్బర్ హుస్సేన్, కౌన్సిలర్ నసీరుద్దీన్, సయ్యద్ ఆరిఫ్, రత్నాకర్ రెడ్డి, కొల్కూర్ ప్రవీణ్, రామ్ రెడ్డి, అంజన్న, కాలనీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# నిర్వాహకుల లోపం. వినియోగదారులకు శాపం

**మెదక్ లో గ్యాస్ కష్టాలు**

**మెదక్ మార్చి,13(సిరిన్యూస్)**

మెదక్ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో గ్యాస్ వినియోగదారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. గ్యాస్ కొరత లేదని అధికారులు చెబుతున్నప్పటికీ, సిలిండర్ కోసం వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూలలో నిలబడాల్సి వస్తోంది.ఫోన్ ద్వారా బుకింగ్ సరిగా కాకపోవడం, ఓటీపీ సమస్యలు తలెత్తడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అంతేకాకుండా అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో జరుగుతున్న ఉద్రిక్తతల ప్రభావం కూడా సరఫరాపై పడుతున్నట్లు చెబుతున్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డోర్ డెలివరీ సరిగా చేయడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు ఏజెన్సీల వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు అధికారులను, ఇటు గ్యాస్ ఏజెన్సీ లను కోరుతున్నారు.

# ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫా అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కొంపల్లి.మార్చ్-14(సిరి న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి పథకాలలో భాగంగా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫాలు (దుస్తులు )పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు కొంపల్లిలో మసీద్ వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని స్థానిక కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్ తో కలిసి పంపిణి చేసారు.లేబర్ సెల్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి,ఆదిరెడ్డి మోహన్ రెడ్డి,మాజీ కోఫ్షన్ సభ్యులు షైక్ ఇబ్రహీం, పూర్ణచందర్ రావు,జయభేరి గోపాల్ రెడ్డి,అశోక్ రెడ్డి,ఉపేందర్ రెడ్డి,అంజి ముదిరాజ్,కుంట శ్రీనివాస్,మజీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్, సభ్యులు షైక్ ఖాదీర్,సలీం,మైబలి,జహంగీర్,దస్తగిరి మరియు బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ సిఐ బృందాలు ఆకస్మిక దాడులు



**తూప్రాన్ మార్చ్ 13 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణంలోని పలు హోటల్స్ దాబాలపైన శుక్రవారం రోజు సాయంత్రం దాబా హోటల్స్ రెస్టారెంట్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల పైన దాడులు నిర్వహించగా 18 సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్న సీజ్ చేయడం జరిగిందని తెలిపారు గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను హోటల్ యజమానులు వ్యాపారాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని

కమర్షియల్ సిలిండర్లు వాడకుండా గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్ ను వాడుతున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నామని తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సిఐ రంగాకృష్ణ తెలిపారు కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ కానిస్టేబుల్స్ చంద్రం ప్రసాద్ సెలక్షన్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు

# కలెక్టర్ ను సన్మానించిన టీయూడబ్ల్యూజే బృందం



**మెదక్ మార్చి,13(సిరిన్యూస్)**

మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ ను టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి డైరీ అందజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాగరాజు, యూనియన్ సీనియర్ నాయకులు, జర్నలిస్టులు ఫరూక్ హుస్సేన్, మురళీధర్, ఖయ్యూం, రాజశేఖర్, లక్ష్మి నారాయణ, నర్సింలు, అల్లాడి శేఖర్, కృష్ణమూర్తి, ముజీబ్ తదితరులున్నారు.

# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

## పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



**వెల్దుర్తి మార్చి 13,(సిరి న్యూస్ ):**

నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల కోసం వెల్దుర్తి మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యా అధికారి బుచ్చ నాయక్ చీఫ్ సూపర్డెంట్లు సాంబయ్య, రామ గౌడ్, లు తెలిపారు. మండలంలోని వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 249 , కుక్కునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 156 మొత్తం 405 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగినంత మంది సిబ్బందిని నియమించామని, పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని ఆయన పేర్కొన్నారు.

# అమీన్‌పూర్ సర్కిల్‌లో ఫైర్ సేఫ్టీపై ముమ్మర తనిఖీలు

**అమీన్‌పూర్, మార్చి13, (సిరిన్యూస్)**




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “99 రోజుల యాక్షన్ ప్లాన్” కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం అగ్ని భద్రత (ఫైర్ సేఫ్టీ)పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో ఏసీపీ, టీపీబీవో మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు సర్కిల్ పరిధిలోని 36 వాణిజ్య భవనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అగ్ని భద్రతా ప్రమాణాలు సరిగా పాటించని 16 భవనాలను గుర్తించి, తక్షణమే ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. అగ్ని భద్రతా నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణ మరియు ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. అమీన్‌పూర్ సర్కిల్‌లోని ప్రముఖ వాణిజ్య సంస్థలైన ట్రెండ్స్ మరియు విజేత భవనాల్లో కూడా అగ్ని భద్రతా వ్యవస్థలను పరిశీలించారు. ట్రెండ్స్ భవనం సెల్లార్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన అధికారులు వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. విజేత భవనం మేనేజర్ తమ భద్రతా పరికరాల పనితీరును అధికారులకు ప్రదర్శించారు. వాణిజ్య భవనాల యజమానులకు అగ్ని భద్రతపై అవగాహన కల్పించడం, సెల్లార్లలో ప్రమాదకర వస్తువులు లేకుండా చూడటం, భద్రతా పరికరాల అమరికను పర్యవేక్షించడం వంటి చర్యలను యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగ ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి ఆదర్శంగా నిలవాలి

## అమీన్‌పూర్ సీఐ నరేష్

**అమీన్‌పూర్, మార్చ్ 13, (సిరిన్యూస్)**



గ్రామ అభివృద్ధి కమిటీలు గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేసి ఆదర్శంగా నిలవాలని అమీన్‌పూర్ సీఐ నరేష్ పేర్కొన్నారు. బీరంగూడ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అదెల్లి రవీందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అమీన్‌పూర్ సీఐ నరేష్, ఎస్ఐ విజయరావును కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ నరేష్ మాట్లాడుతూ అభివృద్ధి కమిటీలు గ్రామాభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికలు రూపొందించి, అన్ని రంగాలలో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగా సమిష్టిగా పనిచేయాలని సూచించారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. రవీందర్ నాయకత్వంలో కమిటీ మంచి పనులు చేసి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. బీరంగూడ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అదెల్లి రవీందర్ మాట్లాడుతూ సీఐ నరేష్ ఇచ్చిన సూచనలు ఎంతో విలువైనవని, వాటిని అమలు చేస్తూ మంచి ప్రణాళికతో ముందుకు వెళ్లి గ్రామంలో శాశ్వత అభివృద్ధి సాధించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు పిర్జపతి సత్యనారాయణ, నక్కల కిష్టయ్య, కార్యదర్శి బంటు రమేష్, దండు జ్ఞానేశ్వర్, కోశాధికారి బంటు శివ, కార్యవర్గ సభ్యులు బంటు ప్రవీణ్, ఎడ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గంగా జమున తెహజీబ్ సంస్కృతికి ప్రతీక తెలంగాణ








- **ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కేసిఆర్ పెద్ద పీట**
- **పటాన్ చెరు లో గత 27 సంవత్సరాలుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం హర్షనీయం**
- **తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ**
- **భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్ చెరు**
- **సబ్బండ వర్గాల సంక్షేమమే మా లక్ష్యం**
- **ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధం నిలిచిపోవాలని అల్లాను ప్రార్థించండి**
- **ముస్లింల సంక్షేమానికి సంపూర్ణ సహకారం**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో భారీ ఇఫ్తార్ విందు**
- **భారీ సంఖ్యలో హాజరైన ముస్లిం సోదరులు, సీనియర్ నాయకులు**

**పటాన్ చెరు, మార్చి 13, (సిరి న్యూస్):**

గంగా జమున తెహజీబ్ సంస్కృతికి ప్రతీక తెలంగాణ రాష్ట్రమని.. దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేసిన మహోన్నత నేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అలీ అన్నారు. గత 27 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కే దక్కిందని ప్రశంసించారు. శుక్రవారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మహమ్మద్ అలీతో పాటు, శాసనమండలి మాజీ ప్రోటైం చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహమూద్ అలీ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం రాష్ట్రంలోని ముస్లింల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి మరువలేనిదని అన్నారు. పటాన్ చెరు నియోజక వర్గంలో అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ.. గొప్ప సెక్యులర్ వాదిగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నిలిచిపోతు న్నారని అభినందించారు. సొంత నిధులతో ఆశీర్ఖానాలు, మసీదులు, దర్గాలు నిర్మిం చడం అభినంద నీయమన్నారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం ముగిసిపోయేలా అల్లాను ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో పుష్కలంగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారో గ్యాలతో ఉండాలని ప్రార్థించాలని కోరారు. నియోజకవర్గంలో కులం మతం ప్రాంతాలకు అతీతంగా పరమత సహనం పెంపొందిస్తున్నామని తెలిపారు. ముస్లింల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ముస్లింలకు తగు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతి నిధులు, సీనియర్ నాయకులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నిజం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి.

**సదాశివపేట. మార్చి 13.**

(సిరిన్యూస్) కంబాలపల్లి గ్రామ సర్పంచ్ ఇంధూరి భరతమ్మ బాబు ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా సి డి సి చెర్మెన్ గడీల రాంరెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కుతుందన్నారు. పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ప్ర భుత్వం పథకాలను చేపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెజింతల్ సర్పంచ్ ఆశిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అద్యక్షుడు భీంసేనారెడ్డి. ఉపసర్పంచ్ కుమ్మరి పార్వతమ్మ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్.సభ్యుడు ప్రభు. ప్రభాకర్ రెడి. మునీర్. కృష్ణ .నర్సిములు.సురేష్. మేస్త్రీ దుర్గా, మేస్త్రీశివ తధితరులు పాల్గొనడం జరిగింది.





# మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

**తూప్రాన్ మార్చు 13 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ నూతన చైర్మన్ బొంది రజిని జన్మదిన వేడుకలను వైస్ చైర్మన్ కొక్కొండ సమత పాలకవర్గ సభ్యులు తోటి మహిళా కౌన్సిలర్లు శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా చైర్మన్ బొంది రజిని మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 16 వార్డులలో ఉన్నటువంటి ప్రతి చిన్న సమస్యనైనా పరిష్కరించుకుని ముందుకు సాగుదామని తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సోదరి సోదర కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలుపుతూ మిఠాయిలు తినిపించి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్ బిఆర్ఎస్ నాయకుడు కాశిరెడ్డి 11వ వార్డు మాజీ కౌన్సిలర్ అరుణ వెంకట్ గౌడ్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు






# హిందు ముస్లిం భాయి భాయి

**మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**సిద్దిపేట మార్చి 13(సిరి న్యూస్)**

హిందు ముస్లిం భాయి భాయి గంగా జమున నదుల్లా ఉంటారని ఒకరిని ఒకరు గౌరవించుకోవడం అన్నదమ్ముల్లా కలిసి ఉంటామని నాటి నిజాం నుండి రంజాన్ వేడుకలు ఇఫ్తార్ విందు ప్రారంభం అయ్యిందని అన్నదమ్ములా కలిసి జరుపుకుంటామని మంత్రి గడ్డం వివేక్ అన్నారు సిద్దిపేట జిల్లా కేంద్రం లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం లో మంత్రి సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ గడ్డం వివేక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు లో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి వివేక్




మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల కోసం మైనార్టీల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చామని ప్రతి ముస్లిం కు అర్హులైన మైనార్టీలకు అందజేస్తామని తెలిపారు మైనార్టీ శాఖ మంత్రితో మాట్లాడి సిద్దిపేట ముస్లింలకు సంబంధించి సమస్యలన్నీ పరిష్కరిస్తామని అన్నారు ముస్లిం సోదరులతో తనకు చక్కటి సంబంధాలు ఉన్నాయని తనకుంచెందిన వ్యాపారా వాణిజ్యలలో రెండువందల మందికి ఉపాధి లో ఉన్నారని తన ఫైనాన్స్ అంతా ఒక ముస్లిమ్ భాయి చూసుకుంటారని తెలిపారు... సిద్దిపేట ముస్లిం సోదరులకు ఖబ్ రాస్థాన్ కోసం స్థలం కావాలని కోరుతున్నారు వెంటనే స్థలం ఎక్కడ ఉందో చూసి ఖభరస్థాన్ కోసం స్థలం కేటాయించాలని ఆర్డీవో ను ఆదేశించారు వారికి స్థలం కేటాయించాలని అన్నారు ఈ సందర్భంగా మంత్రి వివేక్ కు ముస్లిం సోదరులు శాలువా కప్పి ముస్లిం టోపీ ధరించి దట్టి కత్తి సన్మానించారు.. ఈ కార్యక్రమం లో సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అతు ఇమామ్ ముస్లిం సోదరులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# పదవతరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

- **బాలురకు హాల్ టికెట్ తో ఉచిత ప్రయాణం**
- **బాలికలకు ఆధార్ కార్డుతో ఉచిత బస్ ప్రయాణం**
- **జిల్లా విద్యాధికారి విజయ**

**మెదక్ మార్చి, 13(సిరిన్యూస్)**

శనివారం నుండి ప్రారంభం కానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను రాయనున్న విద్యార్థులకు జిల్లా విద్యాధికారి విజయ బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.., పదవ తరగతి (బాలుర)విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు వెళ్ళేటపుడు బస్ కండక్టర్ కు బస్ పాస్, పదవ తరగతి హాల్ టికెట్ చూపించి రూట్ తో సంబంధం లేకుండా ఉచిత ప్రయాణం , అని బాలికలకు ఆధార్ కార్డు తో ఉచిత బస్ ప్రయాణం పొందవచ్చన్నారు. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా, ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు వ్రాయాలని సూచించారు. పరీక్షలకు ముందు సరైన ప్రణాళికతో చదవడం, సమయపాలన పాటించడం చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు ఇప్పటివరకు చేసిన చదువుపై నమ్మకం ఉంచి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ వారికి అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు. జిల్లా యంత్రాంగం పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు విద్యార్థులకు సంబంధించిన బస్సు పాస్ తో పాటు హాల్ టికెట్ బస్ కండక్టర్కు చూపించినట్లయితే వారి సంబంధించిన రూట్ తో సంబంధం లేకుండా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. జిల్లాలోని 68 పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించామని, విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. 11,247 మంది విద్యార్థులు, 100 ప్రైవేటు విద్యార్థులు ఈ సందర్భంగా పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా విద్యాధికారి విజయ ఆకాంక్షించారు. 10 వతరగతి పట్టా విద్యార్థుల జీవితానికి తొలి పట్టా అని పేర్కొన్నారు.

# ప్రీ ప్రైమరీ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

**ఎం ఎల్ ఏ సంజీవరెడ్డి**

**కల్హేర్, మార్చి 13, (సిరి న్యూస్,):**

ప్రీ ప్రైమరీ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ శాసనసభ సభ్యులు పి సంజీవ రెడ్డి అన్నారు. కల్హేర్ మండలం లోని బీబీ పేట ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలను సంజీవరెడ్డి ప్రారంభిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరంలో సుమారు 1000 పాఠశాలలో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ పాఠశాలల్లో ఫోర్ ప్లస్ విద్యార్థులను చేర్చుకుంటార ని వీరికి బోధించడానికి గాను ఒక ఇన్స్పెక్టర్ను, ఒక ఆయా ను నియామకం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బి సురేష్ మాట్లాడుతూ... ఈ ప్రీ ప్రైమరీ విద్యార్థులను ఒక సంవత్సరం పూర్తిగా గాని వారిని ఒకటవ తరగతిలో అడ్మిషన్ చేసుకుంటారని తెలిపారు. వీరికి ప్రత్యేకంగా యూనిఫామ్, బెల్టు, షూస్, స్టేషనరీ తదితర సామాగ్రిని ప్రభుత్వం ఇచ్చిందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే రాములు, సంజీవ్ కుమార్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.ప్రీ ప్రైమరీ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి




# 108 సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలి....



**ఈఎంఈ కిరణ్ కుమార్ వెల్లడి..**

**రామాయంపేట, మార్చ్ 13 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ సేవలను శుక్రవారం 108 ఈఎంఈ కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న మందుల నిల్వలు, పలు రికార్డులను పరిశీలించారు. బాధితులకు సకాలంలో వైద్యం అందే విధంగా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని ఆయన సూచించారు. సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని బాధితులకు సరైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పైలట్ రమేష్, ఈఎంటి మంజుల పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీ తనిఖీ చేసిన తహసీల్దార్...

**రామాయంపేట లో గ్యాస్ కొరత లేదు..**



**రామాయంపేట, మార్చి 13 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ శ్రీ భవానీ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ, గోదామును తహసీల్దార్ రజిని కుమారీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు రావడంతో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశాల మేరకు గ్యాస్ సప్లై గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ల నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఏజెన్సీలో సరిపడా గ్యాస్ సిలిండర్ల నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించకుండా వినియోగదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఏజెన్సీ యజమానికి తహసీల్దార్ సూచించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా సరఫరా చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేవని అధికారులు వెల్లడించారు.

# చేగుంటలో పేకాట పై పోలీసు ల దాడి...

- **పేకాట ఆడుతున్న ఆరుగురి పై కేసు నమోదు....**
- **రూ.57,830నగదు, 3 ఫోన్లు స్వాధీనం .....**
- **మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ....**




**రామాయంపేట, (చేగుంట) మార్చి 13 (సిరిన్యూస్)**

మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల గ్రామ శివారులో శుక్రవారం నాడు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.57,830 నగదు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడుగుల అరుణ్, కేదారి చంద్రం, చిట్టం వెంకటేష్, పరా ప్రవీణ్, గోపాటి పెంటయ్య, మచ్చు శ్రీకాంత్‌లను పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఘటనపై చేగుంట పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి అక్రమ చర్యల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువత ఇలాంటి చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# యూ టర్న్ తీసుకుంటుండగా ప్రమాదం

**మునిపల్లి, మార్చి 13 (సిరి న్యూస్):**



మునిపల్లి మండల పరిధిలోని కంకోల్–మగ్గంపల్లి చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యూనివర్సిటీ వైపు నుంచి వచ్చిన ఒక కారు కంకోల్ చౌరస్తా వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా, సమయంలో ఉగ్గలి గ్రామానికి చెందిన వ్యక్తి ప్రయాణిస్తున్న స్ప్లెండర్ బైక్ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తులకు స్వల్ప గాయాలు కాగా, కారుకు ముందు భాగం మరియు డోర్‌కు నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న స్థానికులు స్పందించి గాయపడిన వారికి సహాయం చేశారు. కొంతసేపు అక్కడ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.